


లక్షనాగవల్లీ దళార్చన

ఫిరంగిపురం:113 తాళ్లూరులోని ప్రసన్నాంజనేయస్వామికి సోమవారం 23 మంది రుత్వికులతో లక్ష నాగవల్లీ దళాలతో అర్చన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 513.60 అడుగుల వద్ద ఉంది. ఇది 137.8642 టీఎంసీలకు సమానం.

పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం



వెల్దుర్తి:గుండ్లపాడులోని పోలేరమ్మ తల్లి 8వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామ పుర వీధులలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్



గుంటూరు లీగల్: జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతోందని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి సోమవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో గుంటూరు జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్ బెంచెస్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ బెంచెస్ ద్వారా సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇచ్చిన సర్కులర్ ప్రకారం కొన్ని రాజీ పడదగ్గ ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎల్‌ఏటీపీ కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులు పరిష్కరించటం జరుగుతుందన్నారు. కక్షిదారులు, పోలీస్‌శాఖ, స్టేక్ హోల్డర్స్ ఈ జాతీయ లోక్ అదాలత్ ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని సూచించారు. సివిల్ కేసుల్లో అప్పీల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీ చేసే దిశగా కక్షిదారులకు, న్యాయవాదులకు సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా విమల



పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు జిల్లా రీజియన్ మేనేజర్‌గా సీహెచ్.విమల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్న ఆమెను ఇక్కడ నియమించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్‌ఎంగా పనిచేసిన ఎం.రవికాంత్ డెప్యూటీ సీటీఎంగా బదిలీపై నెల్లూరు వెళ్లారు. విమలను ఆర్టీసీ సిబ్బంది, అధికారులు అభినందించారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో డాక్టర్ సత్యవేణికి 12వ ర్యాంకు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇటీవల ప్రకటించిన ఆల్ ఇండియా ఎయిమ్స్ సర్జికల్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డాక్టర్ సత్యవేణి జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. డాక్టర్ సత్యవేణి విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసి, ప్రస్తుతం నిమ్రా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ మాచర్ల సృష్టి కూడా జాతీయ స్థాయిలో జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి బెంగళూరులోని శ్రీ జయదేవ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో వాస్కులర్ సర్జరీ(ఎంసీహెచ్)లో ప్రవేశం పొందారు.

21న యోగాసనాల్లో అందరూ పాల్గొనాలి



గుంటూరు వెస్ట్: ఈనెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న యోగాసనాల్లో వీలైనంత మంది పాల్గొనేలా చేయాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ నుంచి అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడుతూ యోగాసనాలు వేసేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో గుర్తించిన 4879 ప్రాంతాలను అధికారులు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. యోగాంధ్ర–2025లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరినీ 21న జరగనున్న కార్యక్రమంలో హాజరయ్యేలా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. యోగాసనాల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

31వరకు అతిసారం నియంత్రణపై ప్రచారం

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకు అతిసార వ్యాధి నియంత్రణపై ప్రచారం నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం ప్రచారానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఐదేళ్లలోపు పిల్లలు అతిసారతో మృత్యువాత పడకుండా ఉండటమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

రెండు నెలల విరామం తర్వాత మళ్లీ సముద్ర వేట ప్రారంభమైంది. జూన్ 14తో వేట నిషేధం ముగియడంతో సముద్ర వేటకు అనుమతులు లభించాయి. దీంతో ఆగిపోయిన బోట్లన్నీ మళ్లీ జలాల వైపు సాగడానికి సిద్ధమయ్యాయి. సోమవారం మంచి రోజు కావడంతో మత్స్యకారులు బోట్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేటకు బయలుదేరి వెళ్లారు. దీంతో నిజాంపట్నం హార్బర్ పరిసరాల్లో ఉదయం నుంచే సందడి నెలకొంది. మత్స్యకారులు తమ బోట్లపై గాలపట్టు పరికరాలు, ఇంధనం, అవసరమైన సరుకులతో ఏర్పాట్లు పూర్తి చేసి సముద్ర వేటకు బయలుదేరుతున్నారు. సముద్రంలోకి అడుగుపెడుతున్న ప్రతి బోటుకీ ఇతర మత్స్యకారులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

అలలపై వలల వేట

- రెండు నెలల విరామం తరువాత కడలి వైపు మత్స్యకారుల పయనం
- జూన్ 14వ తేదీతో ముగిసిన వేట నిషేధం
- నిజాంపట్నం హార్బర్‌లో సందడి వాతావరణం
- మొగ సామర్థ్యం పెంపుతో మత్స్యకారుల్లో ఆనందం



బోట్లలోకి సామగ్రి ఎక్కించుకుంటున్న మత్స్యకారులు

రేపల్లె: సముద్రంలో మత్స్య సంపద అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏటా ప్రభుత్వం మార్చి 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్రపు వేట నిషేధం అమలు చేయడం జరుగుతుంది. వేటపై నిషేధం పూర్తి అవ్వడంతో జూన్ 15వ తేదీ నుంచి మత్స్యకారులు తిరిగి సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సముద్ర తీర ప్రాంతమైన నిజాంపట్నం హార్బర్ నుంచి వందలాది బోట్లు సముద్ర వేటకు వెళ్లేందుకు ఇప్పటికే సిద్ధమయ్యాయి. వేట నిషేధ సమయం పూర్తయిన తర్వాత తొలిసారిగా సముద్రపు వేటకు వెళ్తున్న గంగపుత్రులు మత్స్య సంపద సంవృద్ధిగా లభించాలని ఇష్టదైవంకు పూజలు చేసుకొని బయలుదేరుతున్నారు. దీంతో హార్బర్ ప్రాంగణం సందడి వాతవరణం నెలకొంది. సుదీర్ఘ విరామం తరువాత తొలి వేటలో మత్స్యసంపద అధికంగా లభిస్తుంటుంది. దీంతో ఎన్నో ఆశలతో గంగపుత్రులు కడలి వైపు పయనమయ్యారు.

మొగ వద్ద సాఫీగా...

హార్బర్ నుంచి సముద్రంలోకి రాకపోకలు సాగించే మొగ వద్ద బోట్లు సాఫీగా సాగిపోతుండటంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.451 కోట్లతో జరుగుతున్న హార్బర్ రెండో దశ అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే మొగ సామర్థ్యం పెంపుదల పనులు పూర్తి కావడంతో మొగ వద్ద బోట్ల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంతో హార్బర్ నుంచి సముద్రంలోని రాకపోకలు సాగించాలంటే ఆటుపోట్లకు అనుగుణంగా సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ఎన్నో గంటల సమయంలో వేచి ఉండటం, ఒక్కొక్క సమయంలో మొగ వద్ద బోట్లు అడుగు భాగం నేలకు తగిలి దెబ్బతినటం వంటి పరిణామాలతో మత్స్యకారులు వ్యయప్రయాసలకు లోను కావాల్సిన దుస్థితి ఏర్పడేది. ఈ పరిస్థితుల్లో హార్బర్ రెండో దశ అభివృద్ధి పనులు ప్రారంభించటం మరీ ముఖ్యంగా మొగ సామర్థ్యం పెంచటంతోపాటు మొగకు ఇరువైపులా 1570 మీటర్ల బౌల్డర్స్ ఏర్పాటుతో ఆధునీకరించే పనులు వేగవంతంగా పూర్తికావటంతో హార్బర్ నుంచి సముద్రంలోకి రాకపోకలు ఏసమయంలోనైనా సులభతరమయ్యాయి. దీంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధమైన బోట్లు



వేటకు బయలుదేరే ముందు బోటుకు పూజలు చేస్తున్న మత్స్యకారులు

వేట నిషేధ సమయంలో బోట్లకు మరమ్మతులు పూర్తి చేసి రంగులు వేయించటం, వలలను రిపేరు చేయటం వంటి పనులు పూర్తి చేసుకున్నారు. వేటకు వెళ్లేందుకు ఉప్పు, ఐస్, తాగునీరు, వంట సామాగ్రి, డీజిల్ తదితరాలు సిద్ధం చేసుకుని వేటకు పయనమయ్యారు.

రాష్ట్ర ప్రజలను మళ్లీ మోసగించిన చంద్రబాబు



చంద్రబాబు నాయుడు మోసాలపై వేసిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, నాయకులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- 'జగన్ అంటే నమ్మకం...చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ

బాపట్ల: రాష్ట్ర ప్రజలను చంద్రబాబునాయుడు మళ్లీ మోసం చేసి ప్రజాగ్రహానికి గురయ్యారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. 'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు నాయుడు అంటే మోసం' అనే పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే ఏడాదిలోపే మళ్లీ బాబు తన నైజాన్ని ప్రదర్శించారని దుయ్యబట్టారు. అమ్మ ఒడి పథకంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 87లక్షల మంది తల్లుల ఖాతాలోకి నగదు జమ చేశారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు ఎంతమంది తల్లులు ఉంటే అంతమంది ఖాతాలకు తల్లికి వందనం వేస్తానని చెప్పి 50లక్షల మందికి మాత్రమే అర్హుల జాబితాలో చోటు కల్పించారన్నారు. 50 సంవత్సరాల మహిళలకు పెన్షన్ ఇస్తామని చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదన్నారు. ఆడబిడ్డ నిధి, ఉద్యోగాల కల్పన విషయంలో కూడా చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలపై దాడులు పెరిగిపోయాయని చెప్పారు. మైనర్ బాలికలపై అత్యాచారాలు పెరిగిపోతుంటే చోద్యం చూస్తున్నారని తెలిపారు. అయ్యో...ఈ కూటమి ప్రభుత్వం ఎప్పుడు పోతుందని ఏడాదిలోపే ప్రజలు ఎదురుచూస్తున్నారని మేరుగ నాగార్జున పేర్కొన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, గవిని కృష్ణమూర్తి, చల్లా రామయ్య, నక్కా వీరారెడ్డి, కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా, తన్నీరు అంకమ్మరావు, కత్తి సుందర రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు రెంటపాళ్లకు మాజీ సీఎం వైఎస్ జగన్ రాక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం రానున్నారని, ఆ పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం పర్యటనకు సంబంధించి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. సుధీర్‌భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల కౌంటింగ్ సమయంలో సత్తెనపల్లి రూరల్ పోలీసుల వేధింపులు, కూటమి నేతల దాడుల నేపథ్యంలో మనస్తాపం చెందిన రెంటపాళ్ల గ్రామ ఉపసర్పంచ్ కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడన్నారు. రెంటపాళ్ల గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ కోరుకుంట్ల నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్నివ్వడంతోపాటు భరోసా కల్పించి ఆయన కాంస్య విగ్రహావిష్కరణను జగన్‌మోహన్‌రెడ్డి చేస్తారన్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నుంచి రోడ్డు మార్గంలో గుంటూరు సత్తెనపల్లి చేరుకుంటారని, అనంతరం సత్తెనపల్లి, పాకాలపాడు మీదుగా రెంటపాళ్లకు చేరుకుంటారన్నారు. పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చేనేతలకు మంచిరోజులొచ్చాయ్

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- కలెక్టర్‌ను సన్మానించిన చేనేత సంఘాల నాయకులు



జిల్లా కలెక్టర్‌ను సన్మానిస్తున్న చేనేత సహకార సంఘాల నాయకులు

బాపట్ల: కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించడంతో చేనేతలకు మంచి రోజులు వచ్చాయని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. కుప్పడం పట్టు చీరలకు జాతీయస్థాయి గుర్తింపు లభించడంపై చేనేత సహకార సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంగా నివేదించడంతో జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కార్మికుల కలలు నెరవేరాయన్నారు. చీరాల కుప్పడం పట్టు చీరలకు గుర్తింపు లభించడం ద్వారా వాటికి మంచి డిమాండ్ పెరుగుతుందని కలెక్టర్ చెప్పారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న చేనేత కార్మికుల కలలు నెరవేరుతాయన్నారు. చేనేత వృత్తికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. తద్వారా చేనేతల సమస్యలన్నీ తీరిపోతాయన్నారు. చేనేత కార్మికులందరికీ మంచి జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, జిల్లా చేనేత చేనేత జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె నాగమల్లేశ్వరరావు, చేనేత సహకార సంఘాల నాయకులు దివి రాంబాబు, జీవీ నాగేశ్వరరావు, కె.వి నాంచారయ్య, శ్రీనివాసరావు, పి వెంకట సుబ్బారావు, పి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి కృషి

బాపట్ల: పి–4 బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. పి–4 కింద డీఆర్‌డీఏ దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు చేయూతనందించే కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. బంగారు కుటుంబాల జీవన స్థితిగతులను పరిగణలోకి తీసుకున్న డీఆర్‌డీఏ 13 కుటుంబాలను దత్తత తీసుకుంది. వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించడం కోసం రూ.10.95 లక్షలను జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. చెక్కు రూపంలో నగదును బంగారు కుటుంబాలకు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఒకరికి బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్, ముగ్గురికి వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. బాపట్ల జిల్లాలో బంగారు కుటుంబాలు 62వేలు ఉన్నాయన్నారు. వారికి చేయూతనందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, వెలుగు అధికారులు కె రవికుమార్, జి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు రెడీ!

- 21 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- 25 నుంచి కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్లు నమోదు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు



ఏప్రిల్ 30న జరిగిన పాలిసెట్‌కు హాజరైన విద్యార్థులు(ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గానూ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 21న ప్రారంభం కానుంది. పాలిసెట్–2025లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 28 వరకు జరగనున్న కౌన్సెలింగ్‌లో ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంది. ఇందు కోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాలుగు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది.

ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాగోరు విద్యార్థులు ఈనెల 20 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించాలి. సర్టిఫికెట్ల పరిశీలనకు హజరుకాగోరు విద్యార్థులు వెంట ఫీజు రసీదు, హాల్ టికెట్, ర్యాంకు కార్డు, టెన్త్ పాస్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకురావాల్సి ఉంది. స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌సీసీ ప్రత్యేక కేటగిరీలకు చెందిన విద్యార్థులు విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హాజరు కావాల్సి ఉంది.

- ఈనెల 21న ఒకటో ర్యాంకు నుంచి 15వేలు, 22న 15,001 నుంచి 32వేలు, 23న 32,001 నుంచి 50వేలు, 24న 50,001 నుంచి 68వేలు, 25న 68,001 నుంచి 86వేలు, 26న 86,001 నుంచి 1,04,000, 27న 1,04,001 నుంచి 1,20,000, 28న 1,20,001 నుంచి ఆపై చివరి ర్యాంకు వరకు హాజరుకావాలి.
- సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 25నుంచి 30వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు ఇచ్చుకోవాలి. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు https // appolycet. ap. gov. in సైట్‌కు లాగిన్ అవ్వాలి.

హెల్ప్‌లైన్ కేంద్రాలు

గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్, నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సమీపంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీ పాత క్యాంపస్, రేపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, బాపట్లలోని బాపట్ల పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఆయా తేదీల్లో ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంది.

పీజీఆర్‌ఎస్‌లో నమోదైన అర్జీలు పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పీజీఆర్‌ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వాటికి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పీజీఆర్‌ఎస్ కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు మా సమస్యలను పరిష్కరించాలంటూ కలెక్టర్ కలసి వినతి పత్రాల ద్వారా కోరారు. తన పరిధిలో ఉన్న వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపగా కొన్నింటిని పరిశీలించి, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

చెరువులు, కుంటలు, సాగునీటి కాల్వల ఆక్రమణలను మూడు నెలలలో తొలగించాలని కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ ద్వారా అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 24,327 నీటి సంఘాల కమిటీలు ఉన్నాయన్నారు. 48,020 ఎకరాలు నీటి సంఘాల పరిధిలో ఉన్నాయన్నారు. 305 చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. 2,449 మంది ఆక్రమణదారులు 299 ఎకరాలను ఆక్రమించారని చెప్పారు. ఆక్రమణలు తొలగించే ప్రక్రియకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలిక మృతి

చిలకలూరిపేట సమీపంలో విషాద ఘటన



చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ బస్సు ఢీకొని చిన్నారి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...వైఎస్సార్ కాలనీకి చెందిన గాలేటి రాంబాబు, కావేరి దంపతులు, వారి మేనకోడళ్లైన పాముసాని బాల సాహితి, వెంకట శృతితో కలిసి బైక్‌పై కనపర్రు చర్చికి వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. రూరల్ మండలంలోని లింగంగుంట్ల వంతెన దాటిన తరువాత అదే మార్గంలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ట్యాంక్‌పై కూర్చున్న వెంకట శృతి(9) బస్సు చక్రాల కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. రాంబాబు, ఆయన భార్య కావేరికి స్వల్ప గాయాలు కాగా, మరో బాలిక బాల సాహితికి ఎలాంటి గాయాలు కాలేదు. వెంటనే పాపను చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలు కావేరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడ్డ వాహనం



చినగంజాం: టమోటో లోడుతో వెళుతున్న బొలేరో వాహనం డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టిన సంఘటన సోమవారం చినగంజాం వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి బాపట్లకు టమోటా లోడుతో వస్తున్న బొలేరో వాహనం చినగంజాం సమీపంలోని జాతీయ రహదారి వద్ద టీ జంక్షన్ చేరుకోగానే సిమెంట్ డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా కొట్టింది. సంఘటనలో ఆర్.శ్రీనివాసరావు సురక్షితంగా బయట పడ్డాడు. హైవే మొబైల్ సిబ్బంది, పోలీస్ మొబైల్ ట్రాఫిక్ మళ్లించి ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రొక్లెయిన్ సాయంతో వాహనాన్ని తొలగించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్ సిక్స్‌లో ప్రతి పథకాన్ని అమలు చేస్తాం

నరసరావుపేట: ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌లోని ప్రతి పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేసిందని, కుటుంబంలో అర్హులైన ప్రతి పిల్లవానికి రూ.13వేలు చొప్పున అందించామని అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సయ్యద్ జిలాని పాల్గొన్నారు.

పోలీసుశాఖకు 33 అధునాతన మోటారు సైకిళ్లు కేటాయింపు

పచ్చ జెండా ఊపి ప్రారంభించిన గుంటూరు జిల్లా ఎస్పీ



నగరంపాలెం: సురక్షితమైన డ్రైవింగ్ ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడుతుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన మూడు బుల్లెట్లు, 30 అపాచీ ద్విచక్ర వాహనాలను సోమ వారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఓ బైక్‌ను కొద్ది దూరం నడిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాల నిర్వహణ కోసం సరికొత్త బైక్‌లతో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఆధునికమైన సాంకేతికతతో కూడిన సిగ్నలింగ్ వ్యవస్థ ఉందన్నారు. ఈ వాహనాలపై సుశిక్షితులైన పోలీస్ సిబ్బందితో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామన్నారు. గుంటూరు నగరం, తుళ్లూరు, తాడేపల్లి, తెనాలి, మంగళగిరి, పొన్నూరు పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు. రహదారులపై వచ్చే, పోయే ఇతరుల వాహనాలకు ఇబ్బందులు కలిగించేలా అడ్డదిడ్డమైన డ్రైవింగ్, రేసులను అరికట్టేందుకు పెట్రోలింగ్ చేపడతామని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా లేదా ట్రాఫిక్ సమస్య తలెత్తిన సత్వరమే పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, ఎస్పీ సీసీ ఆదిశేషు, పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ సీఐ సింగయ్య, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



ఇంకొల్లులో పుస్తకావిష్కరణ చేస్తున్న మండల కన్వీనర్‌లు, నాయకులు

ఇంకొల్లు(చినగంజాం): చంద్రబాబు ఏడాది పాలనలో అభివృద్ధి అడ్రస్ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పావులూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్‌ల ఆధ్వర్యంలో సీనియర్ పార్టీ నాయకులు పాల్గొనగా పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గతేడాదిగా రాష్ట్రంలో చీకటి పాలన కొనసాగుతోందని, అన్యాయం, అక్రమం, వివక్ష, రాజ్యాంగ ఉల్లంఘనలు తప్ప న్యాయం, పారదర్శకత, ఎక్కడా కన్పించడం లేదన్నారు. ప్రజలకు చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి వాటిని అమలు చేయలేక వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, ఇంకొల్లు మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు, మార్టూరు మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, చినగంజాం కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అయేషా బుడే, హరిరామి రెడ్డి, చౌదరి, కోటి శ్రీరాములు పాల్గొన్నారు.

సారా రహిత జిల్లాగా పల్నాడు

- నవోదయం 2.0తో పటిష్టమైన చర్యలు
- ఎక్సైజ్ అధికారులతో సమీక్షలో కలెక్టర్
- రూ.29.40 లక్షల ఆర్థిక సహాయం అందజేత



సారా తయారీదారులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు

నరసరావుపేట: సారా రహిత జిల్లాగా పల్నాడు జిల్లా ఏర్పాటైందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రకటించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లాలో ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు నాటుసారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నవోదయం 2.0లో భాగంగా జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టినట్టు చెప్పారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా మొదటి దశలో 116 అవగాహన సదస్సులు నిర్వహించి దానివలన కలిగే దుష్ప్రభావాలపై ప్రచారరథంతో ఊరురా తిరుగుతూ ప్రచారం నిర్వహించారన్నారు. రెండవ దశలో విస్తృతంగా దాడులు నిర్వహించి తయారీ విక్రయాల్లో ఉన్న వారిపై 32 కేసులు నమోదు చేసి 21 మందిని అరెస్టు చేయగా 138 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 11,400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారన్నారు. బెల్లం విక్రయించకుండా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో సారా వృత్తిగా బతుకుతున్న వారికి చైతన్యం కల్పించి ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించేందుకు కలెక్టర్ సూచనల ప్రకారం 57 మందిని గుర్తించి అందులో అర్హులుగా గుర్తించిన 23 మందికి ప్రత్యామ్నయంగా వారి కుటుంబాలకు రూ.29.40 లక్షలు మొత్తాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఉపాధి, లోన్ రూపంలో అందజేశారు. గుంటూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్లు ఎం.సుధాకర్‌రెడ్డి, ఎం.రవికుమార్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మణికంఠ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.సూర్యనారాయణ, కె.రవీంద్ర పాల్గొన్నారు.

పీ 4 లబ్ధిదారులకు చేయూత

చినగంజాం: కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదుగా మండలంలోని పలువురు పీ-4 లబ్ధిదారులకు చేయూత అందించినట్లు వెలుగు ఏపీఎం సుబ్బారావు తెలిపారు. సోమవారం బాపట్ల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రూ.10.95 లక్షలు నగదును వివిధ రూపాల్లో 13 మంది లబ్ధిదారులకు ఇవ్వగా వారిలో వివిధ వ్యాపారాలు నిమిత్తం రూ.10 లక్షలు.. చెవిటి మిషన్‌లు, ట్రైసైకిల్ అందించినట్లు తెలిపారు. పీ4 కార్యక్రమంలో మొదటి సారిగా చినగంజాం మండలానికి పెద్ద మొత్తంలో లబ్ధి చేకూర్చడం చాలా సంతోషంగా ఉందంటూ కలెక్టర్ అభినందనలు తెలిపారన్నారు.

ఇసుక తరలిస్తున్న 8 లారీలు స్వాధీనం

అమరావతి: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న ఎనిమిది భారీ ఇసుక లారీలను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ అచ్చియ్య అందించిన సమాచారం.. తుళ్లూరు మండలం నుంచి సత్తెనపల్లికి ఇసుక తరలిస్తున్న ఎనిమిది భారీ లారీలను మండల పరిధిలోని ధరణికోట ఆరుడొంకల బావి సెంటర్‌లో స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

నెలకు రెండుసార్లు రుణమేళా నిర్వహిస్తాం

కలెక్టర్ అరుణ్ బాబు



రుణపత్రం అందజేస్తున్న ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, బ్యాంకు అధికారులు

నరసరావుపేట: జిల్లాలో నెలకు రెండు సార్లు మెగా రుణమేళా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, రుణ దరఖాస్తుదార్లతో మెగా రుణమేళా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో ఒకసారి, నియోజకవర్గస్థాయిలో ఒకసారి రుణమేళా నిర్వహించి బ్యాంకు రుణాలు సులభంగా పొందడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. బ్యాంకులకు అందిన రుణ దరఖాస్తులను అక్కడికక్కడే పరిశీలించి రుణవితరణ చేపడతామన్నారు. మొత్తం 338 దరఖాస్తులను పరిశీలించి 50 మంది చిరువ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.50 లక్షలు స్వయం సిద్ధ రుణాలు మంజూరు చేశారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద మరో రూ.32 లక్షలు మంజూరు చేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రుణాలకోసం బ్యాంకులను మాత్రమే ఆశ్రయించటం శ్రేయస్కరమని అన్నారు. రుణాలు అందించేందుకే బ్యాంకులు ఉన్నాయని, ప్రభుత్వ పథకాల ద్వారా అందజేసే రుణాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎల్‌డీఎం రాంప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి, యూనియన్ బ్యాంకు అధిపతి మాధురి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ అధికారి సుభాష్ పాల్గొన్నారు.

నకిలీ బంగారం అంటగట్టి మోసం

నల్లగొండ: తక్కువ ధరకే బంగారం బిస్కెట్ ఇస్తామని నమ్మించి నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసిన ఇద్దరు నిందితులను నల్లగొండ సీసీఎస్, వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో వేముల రాజు మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. గతేడాది నవంబర్ 8వ తేదీ సాయంత్రం గుంటూరుకు చెందిన ఏసు, లక్ష్మి కలిసి షాపు వద్దకు వచ్చి మందులు కావాలని అడిగారు. ఈ క్రమంలో వారు రాజుతో పరిచయం చేసుకున్నారు. ఏసు తన పేరు రవి అని, ఏపీలోని ఒంగోలు జిల్లాలో బిల్డర్‌గా పని చేస్తున్నట్లు పరిచయం చేసుకున్నాడు. తన దగ్గర కొంత పాత బంగారం ఉందని, దానిని తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. బిల్లును రాజుకు చూపించి, దాన్ని పరీక్షించుకోమని అందులో నుంచి ఒక ముక్క తీసి ఇచ్చాడు. రాజు బంగారం షాపునకు వెళ్లి చెక్ చేయించగా అది ఒరిజినల్ అని తెలిసింది. అనంతరం రూ.5లక్షలు ఇస్తే బంగారం బిస్కెట్ ఇస్తానని ఏసు రాజుకు చెప్పాడు. దీంతో రూ.5లక్షలు ఇచ్చి బంగారం బిస్కెట్ తీసుకున్నాడు. ఆ తర్వాత దానిని చెక్ చేయించగా అది నకిలీదని తేలింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన రాజు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నల్లగొండ సీసీఎస్ సీఐ జితేందర్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పక్కా సమాచారం మేరకు సోమవారం నల్లగొండ డీఈఓ ఆఫీస్ వద్ద ఏసు, లక్ష్మిని పట్టుకుని విచారించారు. తామే నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసినట్లు ఒప్పుకున్నారు. ఏసు గుంటూరు జిల్లాలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలై సులువుగా డబ్బు సంపాదించడానికి మోసాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడు గతంలో కూడా హైదరాబాద్‌లోని కుషాయిగూడలో, నల్లగొండలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లాడని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు, అర గ్రాము బంగారం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

తాడేపల్లిలో బాలుడిపై లైంగిక దాడి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలోని డోలాస్‌నగర్‌లో జరిగిన లైంగిక దాడి సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. డోలాస్‌నగర్‌లో మైనర్ దివ్యాంగుడు తన ఇంటి పక్కనే ఉండే మరో ఏడేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదివారం శరీరంపై వెనుక భాగంలో గాయాలు కావడంతో బాగా నొప్పిగా ఉందని బాలుడు ఏడవడంతో ఏమైందని తల్లిదండ్రులను అడగ్గా విషయం చెప్పాడు.దీనిపై మైనర్ దివ్యాంగుడి తల్లిదండ్రులను ప్రశ్నించగా దాడి చేశారంటూ బాలుడు తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో మైనర్ దివ్యాంగుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బాలుడిని పరీక్షల నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. మైనర్ దివ్యాంగుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. జరిగిన సంఘటనపై తాడేపల్లి పోలీసులను వివరణ కోరగా.. సంఘటనపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేశామని చెప్పారు. త్వరలోనే లైంగిక దాడికి పాల్పడ్డ దివ్యాంగుడిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు వారు తెలిపారు.

అసంతృప్తిలో టీడీపీ క్యాడర్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం కోసం కష్టపడిన కార్యకర్తలు ఇప్పుడు ప్రభుత్వం, పార్టీపై ఎంతో అసంతృప్తిగా ఉన్నారని, టీడీపీలో కార్యకర్తలను పట్టించుకోవటం లేదని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన టీడీపీ యువ నాయకుడు బొమ్మిరెడ్డి రామకోటయ్య అన్నారు. టీడీపీ నేతలు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలపై రామకోటయ్య మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో రామకోటయ్య ఏమి మాట్లాడారంటే.... కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం కోసం వైఎస్సార్ సీపీతో గొడవలు పడి ఎన్నో ఇబ్బందులు పడ్డామని, కానీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సూపర్‌సిక్స్ కమిటీ ఏ కార్యకర్తని పార్టీ కార్యక్రమాలకు పిలిచి మాట్లాడలేదని, అడుగడుగున కార్యకర్తలను అవమానిస్తున్నారని వీడియోలో పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలకు ఎటువంటి వ్యాపారంలో భాగస్వాములను చేయకుండా పెద్ద నాయకులే అన్నింట్లో ఉన్నారని రామకోటయ్య ఆరోపించారు. మా లాంటి కార్యకర్తలకు పార్టీ ఏమి చేయలేకపోతుందని, మనకి ఓటు వేసినవారికి కూడా ఏమి చేయలేకపోతున్నామని చెప్పారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మార్టూరు: మార్టూరు జాతీయ రహదారిపై సోమవారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. చిన్నగంజాం మండలం సంతరావూరు గ్రామానికి చెందిన చుండూరి కోటేశ్వరరావు తన భార్య సునీతతో కలిసి ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట నుంచి జాతీయ రహదారిపై స్వగ్రామం వెళుతున్నాడు. స్థానిక రాజుపాలెం సెంటర్లో కోటేశ్వరరావు దంపతులు ప్రయాణిస్తున్న బైకును చిలకలూరిపేట నుంచి చెన్నై వైపు వెళుతున్న కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో భార్యాభర్తలు ఇద్దరు రోడ్డుపై పడి గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరో ప్రమాదంలో..

జాతీయ రహదారిపై ముందు వెళుతున్న మినీ లారీని వెనుక నుంచి బైకుతో ఢీ కొట్టిన ప్రమాదంలో సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు గాయపడ్డాడు. యద్దనపూడి మండలం ఎనమదల గ్రామానికి చెందిన కనపర్తి తేజ స్కూటీపై వలపర్ల వెళుతున్నాడు. స్థానిక రామ్ నగర్ కాలనీ ఎదురు రహదారిపై వాహనం అదుపు తప్పి ముందు వెళుతున్న మినీ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీ ధ్వంసం కావడంతో పాటు తేజ గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం మత్తులో రాళ్లతో దాడి

యువతికి గాయాలు



వేటపాలెం: మద్యం మత్తులో రాళ్లతో దాడి చేసిన ఘటనలో యువతికి గాయాలయ్యాయి. ఈ ఘటన పందిళ్లపల్లిలోని చీరాల-ఒంగోలు రోడ్డు పక్కన పందిళ్లమ్మ దేవస్థానం అర్చి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కొబ్బరిబోండాల దుకాణానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే యుకుడికి అదే గ్రామానికి చెందిన మురళికి పాత గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో రాత్రి సుబ్రహ్మణ్యం, మురళి ఇద్దరూ సెల్ ఫోన్‌లో ఒకరినొకరు రెచ్చగొట్టుకొనే విధంగా మాట్లాడుకున్నారు. అనంతరం మురళి మరో ఇద్దరు స్నేహితులను తీసుకొని వచ్చి ఆర్చి వద్ద మద్యం సేవించి సుబ్రహ్మణ్యంతో గొడవ పడే సమయంలో రాళ్లు రువ్వుకున్నారు. అక్కడే ఉన్న సుబ్రహ్మణ్యం అక్క తలకు రాయి తగలడంతో గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై కె. జనార్దన్ సంఘటనా స్థలానికి వెళ్లి వారిని చెదరగొట్టారు. యువకులను అదుపులోకి తీసుకున్నారు. గాయాలైన యువతి చీరాల ఏరియా వైద్యశాల్లో చేరి ఔట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొడవ పడిన ముగ్గురు యువకులు వేటపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై జనార్దన్ దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో మోసం

నరసరావుపేట రూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నకిలీ కాల్ లెటర్స్‌తో యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన మెట్టల రమేష్, మోసం చేసినట్టు అనంతపురానికి చెందిన యువతీ, యువకుడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. 81 అర్జీలు స్వీకరించారు.

- రెండు సంవత్సరాల క్రితం ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న అనంతపురం జిల్లా గుత్తి మండలం ఉన్నవ గ్రామానికి చెందిన షేక్ సన, గుంతకల్లుకు చెందిన ఆసీఫ్‌లకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కల్పిస్తానని రమేష్ నమ్మబలికాడు. వీరి నుంచి రూ.5.2 లక్షల తీసుకొని నకిలీ కాల్ లెటర్స్ ఇచ్చి మోసం చేశాడు. నగదు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా రమేష్ స్పందించకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- నరసరావుపేటకు చెందిన అమరా వెంకటేశ్వరరావు తమ వద్ద రూ.8 కోట్లు అప్పుగా తీసుకున్నారని, ఆయన మృతిచెందిన తరువాత భార్య సుధారాణి అప్పును తాను చెల్లిస్తానని హామీ ఇచ్చింది. నెల రోజులుగా ఆమె కనిపించకుండా వెళ్లిపోయిందని తమకు న్యాయంచేయాలని బాధితులు ఎస్పీని కోరారు.
- రొంపిచర్ల మండలం అలవాలలో బావిలో పడి దాసరి సురేష్ మృతి చెందిన ఘటనపై తమకు అనుమానాలు ఉన్నాయని, రీపోస్ట్ మార్టం నిర్వహించి నిజాలు వెలికితీయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఎస్పీని కోరారు.
- రష్యాలో పని కల్పిస్తామని ముంబైకి చెందిన రాజీబ్ తమను మోసం చేసినట్టు నకరికల్లుకు చెందిన చిలుకా రాజు ఫిర్యాదు చేశాడు. వీసా కోసం రూ.2లక్షలు చెల్లించామని తెలిపాడు. వీసా వచ్చిందంటే నమ్మి ముంబై వెళ్లగా నకిలీ విమాన టికెట్లతో మోసానికి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు.


ఏపీ టాక్స్ బార్ అధ్యక్షుడిగా రామరాజు శ్రీనివాసరావు



గుంటూరు వెస్ట్ : ఏపీ టాక్స్ బార్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రస్తుత అధ్యక్షుడు ఎం.వి.జె.కె. కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఈ నెల 15న జరిగిన ఎన్నికల్లో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఈ పదవిలో రెండు సంవత్సరాలు పాటు కొనసాగుతారన్నారు. 2000 పైగా ప్రాక్టీషనర్స్, చార్టెర్డ్ అక్కౌంటెంట్స్, న్యాయవాదులు ఈ సంస్థలో సభ్యులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. శ్రీనివాసరావు గతంలో ఏపీ టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (సదరన్) చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. పలు సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక కావడం సంస్థకు ఎంతో ప్రయోజనమని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయనకు కోట సునీల్, ఏ.వి.ఎస్. కృష్ణ మోహన్, చక్ర రమణ, ఫణి కుమార్, సురేష్‌లతోపాటు పలువురు ఆడిటర్లు, చార్టెర్డ్ అక్కౌంటెంట్లు అభినందనలు తెలిపారు.

హాట్సాఫ్ డాక్టర్ !

- మానవత్వం చాటుకున్న డాక్టర్ రాఘవ శర్మ
- నిడమానూరు బైపాస్‌లో రోడ్డులో ప్రమాదం
- తీవ్ర గాయాలతో పడిఉన్న వ్యక్తి
- వెంటనే భుజాలపై తీసుకుని కారులోకి తీసుకెళ్లిన డాక్టర్
- ప్రమాదం నుంచి బయటపడిన బాధితుడు



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న డాక్టర్ రాఘవశర్మ

గుంటూరు మెడికల్: ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమయం.. నిడమానూరు బైపాస్.. రాత్రి పూట చిమ్మ చీకట్లో నెత్తుటి మడుగులో స్పృహ లేకుండా పడి ఉన్న భర్తను చూసి ఆమె గుండెలు బాదుకుంటోంది. అయ్యా.. కాపాడండి ! అంటూ కన్నీరుమున్నీరవుతోంది. అప్పటికే కొన్ని వందల వాహనాలు అటు ఇటు పరుగులు పెడుతున్నా ఆగలేదు. ఇంతలో గుంటూరుకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ పి.వి.రాఘవశర్మ గన్నవరం నుంచి గుంటూరు వస్తున్నారు. రోడ్డు పక్కన దూరంగా పడి ఉన్న బాధితుడు, ఆర్తనాదాలు పెడుతున్న ఆయన భార్య కనిపించారు. వెంటనే కారు ఆపి పరుగు పరుగున అక్కడకు వెళ్లారు. బాధితుడి నాడి పట్టుకున్న వెంటనే మరికొద్ది క్షణాలు మాత్రమే ఊపిరి ఉంటుందని అర్థమైంది. వెంటనే భుజాలపై వేసుకుని ఒక్క ఉదుటున కారు వద్దకు వెళ్లారు. అప్పటి వరకు గుండెల నిండా కన్నీళ్లతో.. అంతులేని దిగులు చీకట్లలో కూరుకుపోయిన ఆ ఇల్లాలు.. వణుకుతున్న తన రెండు చేతులు జోడించి.. అయ్యా దేవుడిలా వచ్చారు! అంటూ దణ్ణం పెట్టింది. వేగంగా బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం నుంచి బయట పడ్డాడు. డాక్టర్ రాఘవశర్మ మానవత్వపు వైద్య సేవలకు అక్కడ ఉన్న ప్రజలు, పోలీసులు 'హాట్సాఫ్ డాక్టర్ !' అంటూ సలాం కొట్టారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి

యువతికి తీవ్ర గాయాలు



వెంకటేష్ మృతదేహం

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి చెందగా, యువతి తీవ్ర గాయాలపాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన వైద్యుడు బూదాటి వెంకటేష్(35) తెనాలి ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ విభాగంలో పని చేస్తున్నాడు. విజయవాడకు చెందిన స్నేహితురాలు యామినీని తెనాలి నుంచి విజయవాడకు తీసుకెళ్లేందుకు బుల్లెట్‌పై బయలుదేరారు. వీఎస్సార్ కళాశాల దాటగానే తెనాలి-విజయవాడ రహదారిపై ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ట్రెయిలర్ ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు ఇద్దరిని తరలించగా, వెంకటేష్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. అపస్మారస్థితిలో ఉన్న యామినికి చికిత్స అందిస్తున్నారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.